# టాన్‌టెక్స్ సాహిత్య పండుగ



డల్లాస్ : ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (టాన్‌టెక్స్) సాహిత్య వేదిక తొలి వార్షికోత్సవం జూలై 14న డల్లాస్‌లోని హిందూ దేవాలయంలో ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా ఆ రోజంతా సాహిత్య సంగీత సమ్మేళనం నిర్వహించినట్లు తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ప్రసిద్ధ సాహితీవేత్తలు గొల్లపూడి మారుతీరావు, బలభద్రపాత్రుని రమణి, రాళ్ళబండి కవితాప్రసాద్, తెలుగు అకాడమీ సంచాలకుడు ఆచార్య ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ సినీనేపథ్య గాయకుడు జి. ఆనంద్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.

ఉదయం 10 గంటలకు ఈ వేడుకలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమయ్యాయి. మంజు తెలిదేవర, గాయత్రి భోగవల్లి ప్రార్థనగీతం 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' ఆలపించారు. అనంతరం టాన్‌టెక్స్ అధ్యక్షురాలు శ్యామ రుమాళ్ళ స్వాగతోపన్యాసం చేశారు. తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర నిర్వహణలో 'తెలుగు సినిమాలపై నవలల ప్రభావం' అనే అంశంపై సాహిత్య గోష్ఠి తొలి సభ ప్రారంభం అయింది. ప్రముఖ నవలా రచయిత్రి బలభద్రపాత్రుని రమణిని ఎమ్వీ యెల్ ప్రసాద్ సభకు పరిచయం చేశారు. మాలపల్లి మొదలు శరత్ నవలలు, మాదిరెడ్డి, యద్దనపూడి, కోడూరి, యండమూరి వంటి రచయితల నవలలు సినిమాలుగా తీసిన వైనాన్ని, ఆ సినిమాల్లో ప్రతిబింబించిన సామాజికాంశాలను రమణి సోదాహరణంగా చర్చించారు.

టాన్‌టెక్స్ సాహిత్య పండుగ



ఇదే వేదిక మీదకు బహుముఖ ప్రజ్ఞాశాలి గొల్లపూడి మారుతీరావును ప్రసాద్ తోటకూర ఆహ్వానించి సభకు పరిచయం చేశారు. మారుతీరావు తన కీలకోపన్యాసం 'ఆత్మకథల కథ' అనే అంశంపై చేశారు. తాను చదివిన పలువురు ప్రముఖుల ఆత్మకథలను పరిచయం చేస్తూ వాటిలోని వివిధ కోణాలను, వాటిలో రాయదగిన, రాయకూడని అంశాలను ప్రస్తావించారు.

మధ్యాహ్నం భోజన విరామానంతరం చంద్రశేఖర్ కన్నెగంటి నిర్వహణలో రెండో సాహిత్య గోష్ఠి జరిగింది. ఈ చర్చలో 'తెలుగు భాష ప్రాశస్త్యం - భవిష్యత్తు' అనే అంశంపై డాక్టర్ ప్రతాప్‌రెడ్డి ప్రసంగించారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా ఎందుకు అవసరమో ఈ సందర్భంగా ఆయన సవివరంగా పేర్కొన్నారు. అనంతరం రాళ్ళబండి కవితా ప్రసాద్ అవధానం జరిగింది. అత్యంత వేగంగా కేవలం 45 నిమిషాల్లో ముగిసిన ఈ అవధాన కార్యక్రమం ఆహూతులందరిని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. పృచ్ఛకుల సమస్యలను రాళ్ళబండి అలవోకగా పూరించిన విధానం అందరినీ రంజింపజేసింది. ఆచార్య పుదూర్ జగదీశ్వరన్ ఈ అవధానానికి సంధానకర్తగా వ్యవహరించారు. పులిగండ్ల విశ్వనాథం, డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, లంకా చంద్రశేఖర్, డాక్టర్ రమణ జువ్వాడి, రావు కల్వల, వంగూరి చిట్టెన్‌రాజు, ప్రసాద్ తోటకూర, కె.సి. చేకూరి తదితరులు పృచ్ఛకులుగా పాల్గొన్నారు. అవధానం అనంతరం సినీ నేపథ్య గాయకుడు జి. ఆనంద్ తన గానమాధుర్యంతో సభను అలరించారు.